నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం | అక్టోబర్ 09, 2023 | www.navatelangana.com

నాటు సార స్థావరాలపై పోలీసుల దాడి



నవతెలంగాణ- రామారెడ్డి

మండలంలో రాజమ్మ తండాలో ఆదివారం నాటు సార స్థావరాలపై ఎక్సైజ్, స్థానిక పోలీసులు దాడి చేశారు. రాజమ్మ తండా కు చెందిన గంగావత్ గోపాల్ ఇంట్లో 6 లీటర్ల నాటు సారా, నాటు సారా తయారు చేసే సామాగ్రిని పట్టుకొని, అక్కడే ధ్వంసం చేసి, గోపాల్ పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ విక్రమ్ తెలిపారు. దాడిలో స్థానిక ఎస్ఐ సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద ఏపీఓ సస్పెండ్



నవతెలంగాణ-బిచ్కుంద

ఉపాధి హామీ బిచ్కుంద ఏపీఓ అన్నపూర్ణను కామారెడ్డి జిల్లా డీఆర్ డీఏ పీడీ సాయన్న సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. తమ విధులకు హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉపాధి హామీ పనుల్లో కూలీలకు పనులు కల్పించకపోవడం మండలంలోని పనులు వెనుకంజులో ఉండడంతో నోటీసులు, మెమోలు జారీ చేసినా వాటికి సంజాయిషీలు ఇవ్వకపోవడం పై అధికారుల సూచనలు పాటించకపోవడం విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఏపీఓ అన్నపూర్ణను సస్పెన్షన్ వేటు వేశారని ఆయన తెలిపారు.



ర్యాలీ చేపడుతున్న వైద్యులు

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

నవతెలంగాణ-మోపాల్

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న క్యాన్సర్ అవేర్నెస్ మాసం సందర్భంగా నిజామాబాదులో ఇందూర్ క్యాన్సర్ హాస్పిటల్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్తంగా క్యాన్సర్ అవేర్నెస్ ర్యాలీని బోర్గాం పి ప్రభుత్వ పాఠశాల నుండి పూలాంగ్ వరకు నిర్వహించారు. విశిష్టాథితులుగా డాక్టర్ అజయ్ కుమార్, అభినవ్ సర్దార్ లోహిత్ కుమార్, జిల్లా ప్రభుత్వాసుపత్రి డైరెక్టర్ ప్రతిమ రాజ్ పాల్గొన్నారు. అలాగే ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఎం కిరణ్ కుమార్ పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఇందూర్ క్యాన్సర్ ఆస్పత్రి తరపున హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రద్యుమ్నారెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి భయంకరమైన వ్యాధిగా క్యాన్సర్ గుర్తింపు పొందిందని క్యాన్సర్ బాధితులకు అందరు చేయూతనివ్వాలని అలాగే ఇది మొదటి రెండవ స్టేజిలో నయం చేసే వ్యాధి అని ప్రజలందరూ దీని పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని ఆయన తెలిపారు. అలాగే ర్యాలీలో క్యాన్సర్ సంబంధించిన నినాదాలను ఇచ్చారు. ఊరేగింపు చివరగా పులంగ్ చౌరస్తాలో జాతీయ గీతం ఆలపించి ర్యాలీని ముగించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్, యు.వి ఫౌండేషన్, మేఘన డెంటల్ కాలేజ్, ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్, బీసీ ఉద్యోగ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గెలుస్తానని నమ్మకం లేకనే
సీఎం కేసీఆర్ రెండు చోట్లా పోటీ

- కామారెడ్డిలో కేసీఆర్‌ను ఓడించి తీరుతా..
- లేకుంటే రాజకీయ సన్యాసం తీసుకుంటా : బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇంఛార్జి కాటిపల్లి వెంకట రమణ రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

కేసీఆర్ ఓటమి భయంతోనే గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలో పోటీ చేస్తున్నారని బిజెపి కామారెడ్డి అసెంబ్లీ ఇన్చార్జి కాటుపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ గురించి నియోజకవర్గ ప్రజలు తెలుసుకోవాలి. 2001 లో కేటీఆర్ అమెరికాలో ఉన్నారు. 2008 లో సిరిసిల్ల నుండి మహేందర్ రెడ్డి ని పక్కన పెట్టి కేటీఆర్ పోటీ చేశారు. 250 ఓట్ల బోటా బోటి మెజారిటీతో గెలిచారు. 2014లో తెలంగాణ ఆవిర్భావం తరువాత కేటీఆర్ మంత్రిగా కొనసాగారు. కేటీఆర్ సిరిసిల్ల ప్రజలకు మండలానికి ఒక డిగ్రీ కళాశాల, మిని స్టేడియం, ఉమెన్స్ డిగ్రీ కళాశాల ఇలా చాలా మాటలు ఇచ్చారు వాటిని ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. 'కేసిఆర్ పోటీ చేయటానికి నిజంగానే బలమైన కారణం ఉంది. ఇప్పటికే సిరిసిల్ల, గజ్వేల్, సిద్ధిపేట లో అందరిని బానిసలుగా చేశారు. ఇప్పుడు కామారెడ్డిలో బానిసలుగా చేయటానికి వస్తున్నారు. గజ్వేల్ ప్రజలు మా దరిద్రం పోయింది అనుకుంటున్నారు. గత 30 సంవత్సరాల నుండి ప్రజలను పట్టించుకోని వారు కానీ 280 కొట్లు ప్రజా సొమ్ము ఇస్తున్నారని అన్నారు.

రైతులు ఐక్యతను చాటి చెప్పుకోవాలి

నవతెలంగాణ-రాజంపేట్



సమావేశమైన రైతులు

రైతుల ఐక్యతను చాటి చెప్పుకోవడమే కర్షక మిత్ర సంక్షేమ సంఘం ముఖ్య ఉద్దేశమని కామారెడ్డి జిల్లా సంఘ అధ్యక్షులు దొడ్ల రాజేందర్రావు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో రైతులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులకు సహాయ సహకారాలు అందిస్తూ రైతులను ముందుకు తీసుకెళ్లాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, కార్యదర్శి నవీన్, సహాయ కార్యదర్శి భరత్,కోశాధికారి బండారి సంజీవరెడ్డి, సలహాదారులు కామిశెట్టి శంకర్, గంగుల రాజి రెడ్డి సభ్యులు పాల్గొన్నారు

గంగాప్రసాద్ అమర్ రహే

- అశేష జనవాహిని మధ్య జవాన్‌కు కన్నీటి వీడ్కోలు
- అంతిమయాత్రలో పాల్గొన్న వేలాది మంది
- జాతీయ జెండాలు చేతబూని ర్యాలీ చేపట్టి
- దారిపొడవునా నినాదాలు
- నివాళి అర్పించిన కలెక్టర్, సీపీ
- సైనిక లాంఛనాలతో తుది వీడ్కోలు



రోధిస్తున్న భార్య



జవాన్‌కు తుది వీడ్కోలు పలుకుతున్న గ్రామస్తులు, కుటుంబీకులు

నవతెలంగాణ-బోధన్

సిక్కిం వరదల్లో గల్లంతయి మృతి చెందిన సాలూర మండలం కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ నీరడి గంగాప్రసాద్ (28) అంత్యక్రియలు ఆదివారం ఆయన స్వగ్రామం కుమ్మన్ పల్లిలో అశేష జనవాహిని నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ చుట్టుపక్కల నుంచే కాకుండా సమీప గ్రామాల నుంచి బంధు మిత్రులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు తరలివచ్చి ఈ అంత్యక్రియలలో పాల్గొన్నారు.

సిక్కిం రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా తీస్తా నది ఉధృతరూపం దాల్చి సంభవించిన వరదల్లో లాన్స్ నాయక్ హోదాలో పని చేస్తున్న ఆర్మీ జవాన్ గంగాప్రసాద్ గల్లంతై మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. గల్లంతైన జవాన్ల ఆచూకీ కోసం జరిపిన గాలింపు చర్యల్లో గంగాప్రసాద్ మృతదేహం గురువారం లభ్యమవగా, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన మీదట ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి నుండి ఆదివారం ఉదయం స్వగ్రామమైన కుమ్మన్ పల్లికి ఆర్మీ జవాన్ పార్థీవదేహం చేరుకుంది. సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ శివారు నుండి కుమ్మన్ పల్లి వరకు వేలాది మంది అంతిమ యాత్రలో పాల్గొని వీర జవాన్ కు అశ్రు నివాళులర్పించారు.

కాగా, గంగాప్రసాద్ అంతిమ యాత్ర బోధన్ నుండి కుమ్మన్ పల్లి వరకు ఇసుక వేస్తే రాలనంతగా అశేష జనవాహినితో నిండిపోయి రహదారి మొత్తం జనసంద్రంగా మారింది. గంగా ప్రసాద్ అమర్ హై నినాదాలు హోరెత్తాయి. త్రివర్ణ పతాకాలు చేతబూని వేలాది మంది స్వచ్ఛందంగా మోటార్ సైకిళ్లపై ర్యాలీగా అంతిమ యాత్రలో పాల్గొని వీర జవాన్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు. దారి పొడుగునా రోడ్డుకు ఇరువైపులా చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా కులమతాలకు అతీతంగా బారులు తీరిన ప్రజలు వీర జవాన్ పార్థీవదేహంపై పూలు చల్లుతూ అశ్రు నయనాలతో వీడ్కోలు పలికారు. అమర్ రహే గంగాప్రసాద్, జోహార్ గంగాప్రసాద్ నినాదాల నడుమ అంతిమ యాత్ర సాగింది. జవాన్ గంగాప్రసాద్ మృతదేహానికి ఆర్మీ అధికారులు సైనిక లాంఛనాలతో నివాళులర్పించారు. గాలిలోకి కాల్పులు జరిపి శ్రద్ధాంజలి ఘటించారు.

బైక్ ర్యాలీ

ఆదివారం వేకువజామున హైదరాబాద్ నుంచి ప్రత్యేక సైనిక వాహనంలో సైనికాధికారులు జవాన్ గంగాప్రసాద్ పార్థివదేహాన్ని స్వగ్రామానికి తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ సైనిక వాహనం ఆచన్‌పల్లికి చేరగానే వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువకులు జాతీయ జెండాలతో బైక్ ర్యాలీతో కుమ్మన్ పల్లికి చేరుకున్నారు. అంతరాష్ట్ర ప్రధాన రహదారి వెంట వేల జనంతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామానికి సైనికుడి పార్థివ దేహం చేరగానే ఇంటి ఎదుట ప్రజల సందర్శనార్థం శవపేటిక ఉంచారు.

శవ పేటిక రాగానే మృతుని భార్య శిరీష, తల్లి సరుబాయి, సోదరుడు ,బంధువులు రోధించిన తీరు కలిచివేసింది. మృతుని కుమారులు తండ్రి కనిపించక తల్లినే చూస్తుండిపోయారు. ఉదయం నుంచే బంధు, మిత్రులు ఇంటికి చేరడంతో జనంతో రద్దీ ఏర్పడింది.

కలెక్టర్, పోలీస్ కమీషనర్ ఘన నివాళి

జవాన్ గంగాప్రసాద్ పార్థివదేహం ఇంటికి చేరగానే సైనికాధికారులు శవపేటికను ఇంటి ఎదుట ప్రజల సందర్శనార్థం ఉంచారు. సైనికుడి పార్థివ దేహానికి జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమీషనర్ సత్యనారాయణ, అదనపు డీసీపీ జయరాం, ఆర్డీఓ రాజాగౌడ్, ఏసీపీ కిరణ్ కుమార్, జిల్లా సైనిక వెల్ఫేర్ ఇంచార్జి రమేష్, సాలూర తహశీల్దార్ పడాల మమత, రూరల్ సీఐ శ్రీనివాస రాజ్ జవాన్ పార్థివదేహానికి పూలతో ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జవాన్ కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం కల్పించారు. అలాగే మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు మేడపాటి ప్రకాశ్ రెడ్డి, మోహన్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు శరత్, గంగారెడ్డి, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు బుద్దె రాజేశ్వర్, మండల అధ్యక్షులు నర్సయ్య జవాన్ గంగాప్రసాద్ కు ఘనంగా నివాళులు అర్పించారు.

సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు..

జవాన్ గంగాప్రసాద్ పార్థివ దేహాన్ని ఆయన ఇంటి నుంచి సైనిక వాహనంలో గ్రామ సమీపంలోని ఎస్సీ స్మశాన వాటిక వద్దకు తరలించారు. అక్కడ కాసేపు ప్రజల సందర్శనార్థం ఉంచిన తర్వాత సైనిక అధికారులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు. అనంతరం ఆచారం ప్రకారం జవాన్ తండ్రి కాశీరాం చితికి నిప్పంటించారు. ఈ సందర్భంగా ఆర్మీ సైనికులు ప్రత్యేక గౌరవ వందనం నిర్వహించి, గాలిలో 3 రౌండ్లు కాల్పులు జరిపి కార్యక్రమం పూర్తి చేశారు. ఈ అంత్యక్రియలకు సైనికాధికారులు ఎస్.కే.మిశ్రా, కల్నల్ ఆర్.ఎస్ రాథోర్, 25 మంది సైనికులు, ప్రయివేటు విద్యాసంస్థల ప్రతినిధులు కొడాలి కిషోర్,శ్రీనివాస రావు, చక్రవర్తి, లయన్స్ క్లబ్ ముఖ్య ప్రతినిధి బసవేశ్వరరావు, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సెల్యూట్ చేస్తున్న జవాన్ కొడుకు



గాల్లోకి కాల్పులు చేస్తున్న సైనికులు



నివాళి అర్పించి కుటుంబీకులతో మాట్లాడుతున్న కలెక్టర్, సీపీ..



జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు

కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి

- జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, మాజీ మంత్రి షబ్బీర్ అలీని విమర్శించే స్థాయి నీది కాదని, ఎమ్మెల్సీ కవిత సుభాష్ రెడ్డి ఎవరో అడుగుతే చెబుతుందని, కవితకు చుక్కలు చూపించిందే సుభాష్ రెడ్డి అని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనాన్ని, నీళ్ల చారుతో కాకుండా, మెనూను పెంచి, మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులను చెల్లించాలని, నాణ్యమైన అల్పాహార భోజనాన్ని విద్యార్థులకు అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయకపోతే నీవు ఎక్కడ ఉండే వాడివో ఆలోచించుకో, తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ, సోనియాగాంధీ చొరవతో ఏర్పాటు చేసింది నీకు తెలియదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీపై, కాంగ్రెస్ నాయకులపై విమర్శించేటప్పుడు జాగ్రత్తగా ఆలోచించి మాట్లాడాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-దోమకొండ



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

దోమకొండ మండల కేంద్రంలో 1997-98 పదవ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కలుసుకొని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని సంతోషాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం పదవ తరగతి పూర్తి చేసి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకొని ఒకరినొకరు కలుసుకొని సుఖ సంతోషాలను పంచుకున్నట్లు చెప్పారు. వివిధ ప్రాంతాలలో వివిధ హోదాలలో స్థిరపడి ఉన్న పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో సిద్ధారెడ్డి, అమర్నాథ్,శివశంకర్, విట్టల్ రెడ్డి, మైసగౌడ్, సంజీవరెడ్డి, రమేష్, గణేష్, రాజమౌళి, శేఖర్, రామ్ కిషోర్, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, శంకర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, శివలింగం, మహేష్, బాబు, కాశిరెడ్డి, రమేష్, వెంకట్ స్వామి, శ్రీనివాస్, పెంటయ్య, నర్సింలు, బాలచంద్రం, స్వామి, శ్రీనివాస్, శ్రీశైలం, సంతోష్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో అభివృద్ధి

- సైంటిస్టులు, విద్యావేత్తలు, మేధావులు తయారు కావడానికి గురువుల పాత్ర కీలకం
- డీఆర్డీవో మాజీ చైర్మన్ జి.సతీష్ రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న సతీశ్‌రెడ్డి

భారతదేశం సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో చాలా త్వరగా అభివృద్ధి చెందుతుందని, త్వరలో ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా నిలుస్తుందని డీఆర్డీవో మాజీ చైర్మన్ జి.సతీష్ రెడ్డి అన్నారు. ఆదివారం డిచ్ పల్లి మండల కేంద్రంలోని జీ కన్వెన్షన్ లో ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన 'బెస్ట్ టీచర్స్ అవార్డ్ సెరెమనీ-2023" కార్యక్రమానికి సతీష్ రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ రిక్కలింబాద్రి లు ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. 150 మంది ప్రైవేట్ పాఠశాలలకు చెందిన టీచర్లకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రతి ఏటా 14. లక్షల మంది ఇంజనీర్లుతయారవు తున్నారని తెలిపారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు చేర్పులు వచ్చాయని, ప్రపంచంలో సాఫ్ట్వేర్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాల్లో వచ్చిన ప్రతి అవకాశాన్ని మన విద్యార్థులు, యువకులు సద్వినియోగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మనకు గతంలో ఒక 5 ఐఐటీలు ఉండేవని, ఇప్పుడు ప్రతి రాష్ట్రంలో ఐఐటీలు ఉన్నాయన్నారు. ఇది వరకు మనం ఉన్నత విద్యా అవకాశాల కోసం బయటికి వెళ్లాల్సి వచ్చేదని కాని ఇప్పుడు ఇక్కడే చదువుకునే అవకాశం ఉందన్నారు. గతంలో మన విద్యార్థులు విదేశాలకు వెళ్లేవారని, ఇప్పుడు 80 శాతం విద్యార్థులు ఇక్కడే ఉండి అన్ని రంగాల్లో తమలో దాగి ఉన్న ప్రతిభను చాటుతూ దేశాభివృద్ధికి తోడ్పతున్నారని తెలిపారు.

ఒక పరిశ్రమ లేదా కంపెనీ ప్రారంభించాలంటే గతంలో యువత వెనుకంజ వేసేవారని ఇప్పుడు స్టార్టప్ల పేరుతో యువత ఎన్నో కంపెనీలు ప్రారంభిస్తున్నారని ఇది దేశానికి శుభసుచకమని తెలిపారు. దేశంలో సైంటిస్టులు, విద్యావేత్తలు, మేధావులు తయారు కావడానికి గురువుల పాత్ర చాలా కీలకమన్నారు. 2018 లో దేశంలో 450 స్టార్టప్ లు మాత్రమే ఉండగా ప్రస్తుతం లక్షకు పైగా దాటి పోయాయన్నారు. ఇందులో 80 శాతం యువతే ఉన్నారని సతీష్ రెడ్డి తెలిపారు.

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. లింబాద్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉన్నత విద్యారంగంలో విద్యార్థుల ప్రవేశాలు అమాంతంగా పెరిగాయన్నారు. ఎంసెట్ లో ఈ సారి కనివినీ ఎరుగని రీతిలో 2.31 లక్షలకు పైగా విద్యార్థులు దరఖాస్తులు అందజేసి పరీక్షలు రాయగా, ఇందులో ఎక్కువగా 11 కంప్యూటర్ కోర్సుల్లో చేరినట్లు తెలిపారు. కొత్త సిలబస్ ప్రకారం విద్యార్థులు మూడు రోజులు కళాశాలలో, మరో మూడు రోజులు కంపెనీలు, పరిశ్రమల్లో పని చేసుకునే అవకాశం కల్పించగా విద్యార్థులకు నెలకు రూ.7 వేల వరకు డబ్బులు సంపాదించే అవకాశం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా బీఎస్సీ హానర్స్ కోర్సు ప్రవేశపెట్టామన్నారు. విద్యలేనిదే ఏదీ సాధించలేమని, సాంకేతిక పరిజ్ఞానం రోజు రోజుకూ అభివృద్ధి చెందుతున్నామని తెలిపారు. దానిలోనే ప్రపంచంలో చంద్రయాన్ 3 ఒక అద్భుతమైన రికార్డు ను సంపాదించుకుందని వివరించారు. తాము చదివిన రోజుల్లో టెక్నాలజీ అంతంత మాత్రంగానే ఉండేదని,అది క్రమేణా వృద్ధి సాధించిందని, దీనంతటికి కారణం విద్యా అన్నారు. విద్యా లేనిదే భవిష్యత్తులో ఏమి సాధించ లేమని పేర్కొన్నారు. ఏదైనా అభివృద్ధి సాదించాలంటే ముందుగా విద్య అవసరమని, మానవ అభివృద్ధి లో విద్య అత్యంత కీలకపాత్ర పోషించిందన్నారు. ఉన్నత విద్యలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. మారుతున్న కాలాని కనుగుణంగా విద్యారంగంలో అనేక మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. గురువులుగా మీ అందరిపై ఎంతో బాధ్యత ఉంటుందన్నారు. ప్రైవేట్ పాఠశాల ల్లో విద్యాబుద్ధులు చేప్పే గురువులకు వారి ప్రతిభ ప్రకారం అవార్డులు అందజేయడం హర్షించదగ్గ విషయమన్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, జిల్లా అధ్యక్షుడు జయసింహగౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి. గంగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానస గణేష్, విష్ణువర్ధన్, జిల్లా కార్యదర్శి ఆర్ఎ జనార్ధన్, కోశాధికారి నిత్యానందం, జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్, జీజీహెచ్ సూపరిండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్, కన్వీనర్ సుందర్, 2 ట్రస్మా మండల అధ్యక్షుడు జీనియస్ గంగారెడ్డి, డివిజన్ ప్రతినిధులు విక్రాంత్, తేలు గంగాదర్, తదితరులు పాల్గొన్నారు.

ఆశాల డిమాండ్లు నెరవేర్చాలి

నవతెలంగాణ-పిట్లం



ఆశాలకు అన్నదానం చేస్తున్న సంతోష్

ఆశాల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వంవెంటనే పరిష్కరించాలని ఏఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు అయ్యల సంతోష్ డిమాండ్ చేశారు. ఆదివారము మండల కేంద్రంలోని నీటిపారుదల అతిథి గృహం నందు ఆశా వర్కర్లు చేపట్టిన సమ్మె 14వ రోజుకు చేరడంతో ఆయన తన ఫౌండేషన్ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించి అన్నదాన వితరణ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు 18 వేల రూపాయల వేతనము ప్రకటించి , ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మిక ఉద్యోగులకు ప్రకటిస్తున్న పిఎఫ్ , ఈఎస్ఐ లను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హనుమ ప్రవీణ్ , బాలయ్య , రాజు , సురేష్ , రవి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభం

నవతెలంగాణ - జుక్కల్



ప్రారంభోత్సవం చేపడుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

జుక్కల్ మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ మండల స్థాయి ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆదేశాల మేరకు సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా విండో చైర్మేన్ శివానంద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయాగౌడ్, సీనియర్ నాయకుడు నీలుపటేల్ మాట్లాడారు. మండల కేంద్రంలో అంబేద్కర్ చౌక్ నుంచి బసవేశ్వర్ చౌక్ విగ్రహ ములమలుపు మీదుగా పోచమ్మ గుడి రోడ్డు వరకు 5 వందల మీటర్లు మేర సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించినట్టు తెలిపారు. సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయితే జుక్కల్ మండల కేంద్రం దశదిశ మారుతుందని, వ్యాపార పరంగా అభివృద్ధి జరిగి రాబోయే కాలంలో డివిజన్ కేంద్రంగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొంపెలి రాములు, మాజీసర్పంచ్ బొల్లి గంగాధర్ , మాజీ ఎంపిపి శెట్కురార్ బస్వంత్ పటేల్, బీఆర్ఎస్ నాయకులు మాదారావ్ దేశాయి, లాడేగాం రాజశేఖర్ పటేల్, గజిరే రాజు, వాగ్రే రమేష్, రాజు, సంతోష్ , కాంగ్రెస్ నాయకుడు దాదారావ్ పటేల్, లక్ష్మన్ గౌడ్, విరేషం, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమస్తే తెలుగు దినపత్రిక
నిజామాబాద్
సోమవారం | అక్టోబర్ 09.2023 | www.navatelangana.com

వ్యక్తి అనుమానాస్పద మృతి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ కేంద్రంలోగల రంగాచారి నగర్ కాలనీలో ఓవ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... పట్టణ కేంద్రంలోని రంగాచారి నగర్ లో మున్నూరు కాపు కులానికి చెందిన సిద్దాపురం పాపన్న(50) కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటాడు. ఆదివారం తెల్లవారుజామున కుటుంబ సభ్యుల మధ్యలో గొడవలు జరిగాయి. ఈ గొడవల్లో మృతుడికి బలమైన గాయాలు తగిలి మృతి చెందినట్లు తెలుస్తుంది. ఇంట్లో జరిగిన గొడవల్లో సిద్దాపురం పాపన్నను మర్డర్ చేసినట్లు స్థానికులు, పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడు సిద్దాపురం పాపన్న శవం ఇంటి పక్కన రోడ్డుపై పడి ఉంది. మృతుడి నుదుటి, కడుపు, ఇతర భాగాల్లో గాయాలయ్యాయి. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. ఘటనాస్థలాన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు, ఎస్సైలు, పోలీసులు పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రానికి చెందిన క్లూస్ టీం పోలీస్ బృంద సభ్యులు, డాగ్ స్క్వాడ్ తనిఖీ చేపట్టారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి

అడిషనల్ డీసీపీ జయరాం

అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ తనిఖీ

నవతెలంగాణ-రెంజల్



మండలంలోని కందకుర్తి చెక్‌పోస్ట్‌తోపాటు మహారాష్ట్ర సరిహద్దుల్లో బెల్లూరు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును అడిషనల్ డీసీపీ జయరాం ఆదివారం తనిఖీల చేశారు. చెక్ పోస్ట్ ల వద్ద సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లా స్థాయి అధికారులు ముందస్తుగా ముమ్మర తనిఖీలను చేపట్టారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట స్థానిక విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నారాయణ, గంగారాం పవన్ తదితరులున్నారు.

గ్రామపంచాయతీ భవనం ప్రారంభం



పంచాయతీ భవనం ప్రారంభించిన జగన్

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని సింగంపల్లి గ్రామపంచాయతీ భవనాన్ని సర్పంచ్. కోల గంగాధర్, ధర్పల్లి జెడ్పిటిసి, జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్ తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి జగన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాతనే గ్రామపంచాయతీ భవనాలకు మహర్దశ వచ్చిందని అన్నారు. గ్రామంలో వైకుంఠధామాలు, చెత్తను సేకరించడానికి ట్రాక్టర్లు, గ్రామ గ్రామాన సిసి రోడ్లు ఇవన్నీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో జరిగాయన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి కమలా నరేష్ ఎంపీపీ లతా కన్నిరామ్ , రైతు సమన్వయ సమితి అధ్యక్షులు శ్రీనివాసరావు, మండల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మోచ్చ శ్రీనివాస్, సర్పంచులు ముత్యంరెడ్డి, ఇందూరు సిద్ధార్థ, ఎంపీటీసీ రమేష్, సొసైటీ చైర్మన్లు నిమ్మల మోహన్ రెడ్డి, ఉమాపతిరావు పాల్గొన్నారు.

ఆలూర్ గంగారెడ్డి విగ్రహం ఏర్పాటు



నివాళ్లు అర్పిస్తున్న గోర్త రాజేందర్

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో తెలంగాణ ఉద్యమంలో ఆలూర్ గంగారెడ్డి కీలక పాత్ర పోషించినారని జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు గోర్తా రాజేందర్ అన్నారు. ఆదివారం ఆలూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగారెడ్డి విగ్రహ ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరపున నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆలూరు గంగారెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

నవతెలంగాణ-బాల్కొండ



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్ఐ

ఆదివారం ఉదయం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఏఎస్ఐ శంకర్ వివరాల ప్రకారం.. ూ పెర్కిట్ నుండి బాల్కొండ వెళ్తున్న పాల ప్యాకెట్లు సప్లై చేసే ఆటో జాతీయ రహదారిపై లింగ మయ్య గుడి కమాన్ దగ్గరలో ఆగి ఉన్న ఐచర్ వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో పెర్కిట్‌కు చెందిన ఆటోడ్రైవర్ కొత్త నాగరాజు (32) మృతి చెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ శంకర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



నిజామాబాద్ రూరల్ : పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్/ఎడపల్లి

తెలంగాణలో సమ్మక్క సారక్క ఆదివాసి గిరిజన యూనివర్సిటీ, పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నందుకు భారతీయ జనతా పార్టీ నిజాంబాద్ మండల శాఖ అధ్వర్యంలో ఆదివారం మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నిజామాబాద్ మండల అధ్యక్షుడు మూల జగన్ రెడ్డి, మల్లారం ఉపసర్పంచ్ రవి, పార్టీ ప్రధాన కార్యదర్శి అన్నం గోపి, ఆదివాసీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడపల్లి: మండలంలో ఆదివారం భారతీయ జనతా పార్టీ ప్రజాప్రతినిధులు సీనియర్ నాయకులు యువకులు పార్టీ కార్యకర్తలు ఆదివారం బస్టాండ్‌లోని జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఎంపీ ధర్మపురి అరవింద్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆర్మూర్ ఏరియాలో భారత ప్రధాని నరేంద్ర మోడీ పసుపు బోర్డు ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. రానున్న అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్ రెడ్డి ,ఎడపల్లి మండల బిజెపి అధ్యక్షులు పోచారం సర్పంచ్ కోల ఇంద్రకరణ్,. మల్లెపూల శ్రీనివాస్, బిజెపి సీనియర్ నాయకులు కల రామచందర్, నాయకులు పాల్గొన్నారు.

యాదవ వధూవరుల వివాహ పరిచయ వేదికను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ముప్కాల్

జిల్లా యాదవ వధూవరుల వివాహ పరిచయ వేదికను విజయవంతం చేయాలని జిల్లా యాదవ సంఘం కోశాధికారి కట్ట మహేష్ యాదవ్ కోరారు. అదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 15న మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్ లో ఈ ఉచిత వివాహ వధూవరుల పరిచయ వేదికను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వచ్చే వారి సౌకర్యార్థం భోజన వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. 10వ తేదీలోపు వధూవరుల కుటుంబసభ్యులు తమ తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోరకు 9010787050, 9912398898, 9440360416, 9398373131 ఈ కింది సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యాదవ వధూవరుల వివాహ పరిచయ వేదిక కమిటీ సభ్యులు బాల్కొండ నియోజకవర్గ కన్వీనర్ శ్రీకాంత్ యాదవ్, గోల్కొండ మహేష్ యాదవ్, చింతాల గంగాధర్ యాదవ్, ఏట్టెం మహేష్ యాదవ్, గడ్డం సాయన్న యాదవ్, సాగర్ యాదవ్, రాజమల్లు యాదవ్, మెరుగు సురేష్ యాదవ్, నరేంధర్ యాదవ్ పాల్గొన్నారు..

పెండింగ్ బిల్లులు ఇవ్వరా..?

- కనీస వేతనం అమలుకాలేదని ఆవేదన
- 11వ రోజు మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె
- పట్టించుకోని ప్రభుత్వం
- కొత్తగా సీఎం బ్రేక్‌ఫాస్ట్ ప్రారంభం



నిరవధిక సమ్మెలో కూర్చున్న మధ్యాహ్న భోజన కార్మికులు (ఫైల్)

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మధ్యాహ్న భోజన పథకం ప్రైమరీ పాఠశాలల్లో 2000 సంవత్సరం నుండి ఉన్నత పాఠశాలలో 2008 నుండి ప్రభుత్వం ప్రారంభించింది. పేద పిల్లలకు భోజన సౌకర్యం కల్పించడంకోసం ఈ మహత్తర కార్యక్రమం తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. ఇందుకోసం వంట చేసేందుకు ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులను నియమించారు. వారికి నెలకు వెయ్యి రూపాయల వేతనం ఇస్తున్నారు. వంటసరుకులకోసం బిల్లులు ఇస్తున్నారు. కానీ బిల్లులు నెలల తరబడి ప్రభుత్వం పెండింగ్ పెడుతోంది. దీంతో సరుకులకోసం కార్మికుల అప్పులు చేస్తూ విద్యార్థులకు భోజనం పెడుతున్నారు. అయినా ప్రభుత్వం వారికి బిల్లులు చెల్లించడంలేదు. బిల్లులకోసం ప్రభుత్వానికి ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడంలేదు. దీంతో కార్మికులు సమ్మెబాట పట్టారు. మరోవైపు రెండురోజులక్రితం సీఎం బ్రేక్‌ఫాస్ట్‌ను ప్రారంభించారు. మధ్యాహ్న భోజన బిల్లులు ఇవ్వడానికి ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వం బ్రేక్‌ఫాస్ట్‌ను ఎలా అమలుచేస్తుంది. మిక్స్ వెజిటేబుల్ కర్రీ, వెజిటెబుల్ బిర్యాని వారానికి మూడు రకాలు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో కార్మికులు కనీస వేతనం అయినా నిర్ణయించాలని వాపోతున్నారు. పౌష్టికాహారం బిల్లులు నెలలతరబడి అందించకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు.

జిల్లాలో 1179 స్కూళ్లు ఉన్నాయి. ఇందులో 1,17,147 మంది విద్యార్థులకు వంట చేసిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, కొత్త మెనూ సవరించాలని, అక్షయపాత్రలాంటి స్వచ్ఛంద సంస్థకు ఇవ్వరాదని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని, ఎలాంటి షరతులు లేకుండా రుణాలు ఇవ్వాలని, వంట సెట్లు, వంటలకు మౌలిక వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు యూనిఫాం ఇవ్వాలని, గ్యాస్ సబ్సిడీ అందించాలని, మార్కెట్ లో 5 రూపాయలకు గుడ్డు రావడం లేదని, గుడ్డు ధర పెంచాలని, హెడ్మాస్టర్ ల ఒత్తిడి తగ్గించాలని, నిత్యావసర సరుకులు ప్రభుత్వమే అందించాలని కోరారు. రాగిజావ, అల్పాహారం వీటన్నింటికి డబ్బులు ఎక్కడి నుంచి తీసుకురావాలని, విద్యార్థులు తల్లిదండ్రులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. వంట పాత్రలు లేవు, కనీస వేతనం లేదు అని ఆవేధన వ్యక్తం చేశారు.

మొన్నటి వరకు టమాటా 200 రూపాయలు , పచ్చిమిర్చి 60 రూపాయలు ధర పెరిగినప్పటికీ కూడా ఎటువంటి సాకులు చెప్పకుండా విద్యార్థులకు వంట వండి పెట్టామని అన్నారు. పాఠశాలలో హెడ్మాస్టర్లు విద్యార్థులకు పాఠాలు చెప్పవలసింది పోయి, వంట దగ్గరనే కూర్చొని వంట గురించి చూస్తున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం బియ్యం ఒకటే అందిస్తున్నప్పటికీ పప్పులు, కూరగాయలు అందించక పోగా కొనుగోలు చేయడం అంటే ఇబ్బందికరంగా ఉందని కార్మికులు చెబుతున్నారు.

కనీస వేతనం లేదు..బిల్లులు నెలల తరబడి రావు

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ అధ్యక్షురాలు (సిఐటియు) చామంతి లక్ష్మి - రెంజల్



గతంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా మధ్యాహ్న భోజన పథక కార్మికులకు ప్రస్తుతం ఉన్న వేతనంకు అదనంగా 2000 ఇస్తానని ప్రకటించారు. ఇప్పటికీ అమలు కాలేదు. ఈ విషయంలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించాం. మధ్యాహ్న భోజనం వండి పెట్టడం కోసం అప్పులు తెస్తున్నాం. వాటికి సంబంధించిన బిల్లులు ఆరు నెలలు అవుతున్నా ఇప్పటికి చెల్లించడం లేదు. డబ్బులు మా చేతుల నుండి పెట్టి, తర్వాత అధికారులను అడుక్కోవలసిన పరిస్థితి ఏర్పడింది.

పట్టించుకునేవారు లేరు

జిల్లా కార్యదర్శి జక్కం సుజాత-ఆర్మూర్



మేము ఇన్ని రోజులుగా సమ్మెలో నిర్వహిస్తుంటే ముఖ్యమంత్రికి వినపడడం లేదు.. కనిపించడం లేదు. ఇప్పటికే ఈ బిల్లులు రాకుండా ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు నూతనంగా బ్రేక్ ఫాస్ట్ ని ప్రారంభించారు. ప్రభుత్వం జీతం ఎంత అందిస్తుంది. మా సమస్యలను పట్టించుకునే వారే లేకుండా పోయారు.

ప్రజాధనం దుర్వినియోగం చేసిన ఘనత మంత్రి ప్రశాంత్‌రెడ్డిదే

- కాంగ్రెస్ నాయకుడు సునీల్ రెడ్డి ఆరోపణ
- మంత్రి అవినీతి పనులపై ఫొటో ప్రదర్శన



ఫొటో ప్రదర్శన సందర్భంగా మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

నవతెలంగాణ-మోర్తాడ్

ప్రజాధనం దుర్వినియోగం చేసిన ఘనత మంత్రి ప్రశాంత్‌రెడ్డిదేనని కాంగ్రెస్ నాయకుడు సునీల్ రెడ్డి ఆరోపించారు. బాల్కొండ నియోజకవర్గంలో మంత్రి తొమ్మిదిన్నర ఏళ్లలో చేసిన అవినీతిపై ఆదివారం ప్రజానిలయంలో ఫొటో ప్రదర్శన చేసి మాట్లాడారు. రహదారులు, చెక్ డ్యాములు, వంతెనలు పూర్తిగా నాసిరకంతో నిర్మించి కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేసిన ఘనత మంత్రి ప్రశాంత్‌రెడ్డికి దక్కిందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వేసిన రహదారులు నేటికీ చెడిపోకుండా ఉన్నాయని, టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేసిన రహదారులు ఒక సంవత్సరంలోపే చెడిపోతూ ప్రజలకు ఇబ్బందులను కలిగిస్తున్నారని అన్నారు. కమిషన్ల కోసమే రహదారులను నిర్మిస్తూ నాసిరకంగా నిర్మించి ప్రభుత్వ ఖజానాను దోచుకు తినడం మంత్రి లక్ష్యం అని అన్నారు. ఏర్గట్ల మండలంలోని భట్టాపూర్ గ్రామ శివారులో కంకర క్రషర్ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసి కోట్ల రూపాయల ఖజానాను దోచుకోవడంలో, కరెంటు బిల్లు సైతం ఎగ్గొట్టిన ఘనత మంత్రి తమ్ముడి ఆగడాలకు అర్థమవుతుందని అన్నారు. నియోజకవర్గంలో గంజాయి రవాణాకు ప్రోత్సహించడం సిగ్గుచేటని తెలిపారు. గంజాయి మత్తులో తన కార్యకర్తలు ఒకరిని హత్య చేసినా గంజాయి రవాణాను నిర్మూలించడంలో పూర్తిగా విఫలమైన మంత్రి అభివృద్ధి అంటూ తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని అన్నారు. ఎన్నికల సమయంలో మంత్రి కానుక అంటూ దసరాకు మహిళలకు చీరలు పంపిణీ చేయడం వారిని కించపరచడమేనని అన్నారు. కాంగ్రెస్ హయాంలో 300 రూపాయలకు దొరికే ఇసుకను ఇప్పుడు 4000 నుండి 5వేలకు చేసి అధికార పార్టీ నేతలకే అనుమతులు ఇస్తూ పెద్దవాగుపై పెత్తనం కొనసాగించడం సిగ్గుచేటని అన్నారు. మండల కేంద్రాలలో ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్ ఎన్ని ప్రదేశాల్లో వెలుగుతున్నాయో మంత్రి అర్ధరాత్రి పూట వచ్చి చూడాలని అన్నారు కుల సంఘాలకు ఐదు లక్షల రూపాయల నిధులు మంజూరు చేయడం ఎన్నికల జిమ్మిక్కు కాకపోతే ఏమిటని, తీర్మానాలు చేసిన కుల సంఘాలకే నిధులు మంజూరు చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు.

పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మాజీ మంత్రి పి. సుదర్శన్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. చౌరస్తాలోని ప్రధాన కూడలిలో నాలుగు నెలలుగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు లచ్చే వార్ నితిన్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం కొనసాగుతోంది. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా నాయకులు అంతిరెడ్డి రాజారెడ్డి, గడుగు గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, జావీద్ ఉద్దీన్, సిహెచ్ రాములు, సాయి రెడ్డి ఉన్నారు.

మాజీ మంత్రి పి సుదర్శన్ రెడ్డి సమక్షంలో సాటాపూర్ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు కోల్ల శ్రీకాంత్, నాయకులు రబ్బాని, మజార్‌తో పాటు పలువురు కాంగ్రెస్ కండువా కప్పుకొని పార్టీలో చేరారు.

కుల సంఘ సభ్యులకు ప్రొసిడింగ్ కాపీలు అందజేత

నవతెలంగాణ- జక్రాన్‌పల్లి

మండలంలోని మునిపల్లి లక్ష్మాపూర్, నారాయపేట్ గ్రామాల్లో ఎస్సీ, బీసీ, మైనారిటీ వివిధ కుల సంఘ సభ్యులకు కోటీ 45 లక్షల విలువగల ప్రొసిడింగ్స్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రొసీడింగ్ పత్రాలు ఆదివారం అందజేశారు. ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ సహకారంతో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి కుల సంఘాలకు 16 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. దీంట్లో భాగంగానే జక్రన్ పల్లి మండలంలో వివిధ గ్రామాలకు పంపిణీ చేస్తున్నామని ఆయన వెల్లడించారు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ఇంటింటికి అందుతున్నాయని. ప్రజలు పనిచేసే ప్రభుత్వాన్ని ఆదరించాలని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి కాంగ్రెస్ నాయకులు ఓట్ల కోసం వస్తారని వారు చెప్పే మాయమాటలు నమ్మొద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల రాజు జడ్పిటిసి తనూజ, శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ ముసుకు తిరుపతిరెడ్డి , చైర్మన్ సాంబారి మోహన్, మండల కోఆప్షన్ సభ్యుడు బుల్లెట్ అక్బర్ ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు నట్టభోజన్న, మండల రైతు బంధు అధ్యక్షులు డీకొండ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మైదం రాజన్న అనంత్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు రాజారెడ్డి, సర్పంచ్ రబ్బా వెంకట్, లక్ష్మాపూర్ సర్పంచ్ కైలాస్, ఎంపిటిసి గుడాల అను, నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం

నవతెలంగాణ- నవీపేట్



కానిస్టేబుల్ ఉద్యోగాలు వచ్చిన వారిని సన్మానించిన సర్పంచ్

మండలం లోని నాలేశ్వర్ గ్రామ పంచాయతీలో నూతనంగా కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు సర్పంచ్ సరీన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. గ్రామంలోని అజయ్, శ్వేత, రాధిక, సోనీ లు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించడం పట్ల ఎంతో గర్వంగా ఉందని అన్నారు. వివేకానంద గ్రంథాలయంలో సభ్యుడిగా ఉండి ఉద్యోగం పొందిన బొప్పరం అజయ్ తన తొలి జీతం నుండి గ్రంథాలయ అవసరాలకు 50 శాతం ఇస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మణ్, ఎంపీటీసీ శ్యామల, వార్డు సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ

నవతెలంగాణ- జక్రాన్‌పల్లి

ఎంపీడీవో కార్యాలయం వద్ద మండల మైనార్టీలకు కుట్టు మిషన్లు ఎంపీపీ కుంచాల విమల రాజు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ బ్రహ్మానందం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నట్ట భోజన్న, ఎంపిటిసి రూపాల గంగారెడ్డి, మండల కోఆప్షన్ బుల్లెట్ అక్బర్ ఖాన్, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఎంఆర్ గార్డెన్‌లో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ఉత్తమ సేవలు అందించిన పలువురు ఉపాధ్యాయు లను సన్మానిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థిని విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే నాని, ప్రతి ఒక్కరి ఉన్నతికి ఉపాధ్యాయులే మార్గదర్శకులు అని అన్నారు. కార్యక్రమంలో పిఆర్‌టియూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభివృద్ధి పై దృష్టి పెట్టకుండా ఇండ్లపై దాడులు చేయిస్తున్నారు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



వినతిపత్రం అందజేస్తున్న ధన్‌పాల్

నిజామాబాద్ నగరంలో ఎమ్మెల్యే అభివృద్ధి మీద దృష్టి పెట్టకుండా బీజేపీ కార్యకర్తల ఇంటి మీద దాడులు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. మితిమీరిన బీఆర్ఎస్ నాయకుల అరాచకాలు, కార్యకర్తలపై వేధింపులుచేస్తే చూస్తూ ఊరుకునేది లేదు అని హెచ్చరించారు. నిజామాబాద్ నగరం లోని 11 వ డివిజన్ బీజేపీ శక్తి కేంద్ర ఇంచార్జి గట్ల గంగాధర్ ఇంటిపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అర్ధ రాత్రి బీరు సీసాల తో కర్రలు, రాడ్లు, మారణాయుధాలతో హత్య యత్నం చేసేందుకు ప్రయత్నించారు అని తెలుసుకున్న దన్ పాల్ సూర్యనారాయణ వెంటనే గట్ల గంగాధర్ తో కలిసి 5 వ టౌన్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని అందించారు. ఈ సందర్భంగా దన్ పాల్ మాట్లాడుతూ నిజామాబాద్ నగరంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మేయర్ , ఎమ్మెల్యే అనుచరులు గుండాయిజం చేస్తూ బీజేపి కార్యకర్తల పై దాడుల కు ఉసిగొల్పుతున్నారని అన్నారు. వెంటనే దాడి చేసిన వ్యక్తులను పట్టుకుని అరెస్ట్ చేయాలన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే కు ఓటమి భయం పట్టుకోవడంతోని దాడులు పెరిగిపోయాయని అన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ పంచరెడ్డి లింగం, జిల్లా ఉపాధ్యక్షులు నాగొల్ల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బంటు రాము, కార్పొరేటర్ ఇల్లెందుల మమత ప్రభాకర్, మండల అధ్యక్షులు పుట్టా వీరేందర్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కోడూరు నాగరాజ్ , బిజెపి నాయకులు భట్టికారి ఆనంద్ ,శివ నూరి భాస్కర్ ,బోత్ శేఖర్, మట్టం పవన్, కిరణ్ ,కిషోర్, కళ్యాణ్ డివిజన్ వాసులు పాల్గొన్నారు

అభివృద్ధి చేసిన ప్రశాంత్ రెడ్డికే మా మద్దతు



తీర్మానపత్రం అందజేస్తున్న కులసంఘాల సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనాపూర్, కొత్తచెరువు తండా గ్రామాల్లో మూడు సంఘాల సభ్యులు బీఆర్ఎస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం అభ్యర్థి, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి మద్దతు తెలిపుతూ ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. గ్రామంలోని మున్నూరు కాపు సంఘం, మత్స్యకారుల సంఘం, భూక్యా గిరిజన తండా కుల సంఘాల సభ్యులు ఈ మేరకు ఆదివారం సంఘ సమావేశాలు నిర్వహించారు. మంత్రి ప్రశాంత్ రెడ్డికి మద్దతు తెలుపుతూ, తమ ఓట్లన్నీ ఆయనకేనని స్పష్టం చేస్తూ ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. బాల్కొండ నియోజకవర్గంలో. కోనాపూర్ గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. మంత్రిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని కుల సంఘాల సభ్యులు ఏకగ్రీవ తీర్మాణాలు చేశారు. తీర్మానాల ప్రతులను జడ్పీటీసీ సభ్యురాలు రాధా రాజగౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దయ్య దేవయ్య, ఎంపీటీసీ సభ్యుడు లకావత్ గంగాధర్, సింగిల్ విండో చైర్మన్ బడాల రమేష్, మండల ఉపాధ్యక్షులు టేకుల రాజు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు లకావత్ సంతోష్, ఉపసర్పంచ్ టేకుల జలంధర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రమేష్ రెడ్డి, జలా రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న విప్

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన ముదాం రాజయ్య గతంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో మృతి చెందగా శనివారం రాత్రి కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రవీంద్ర కళాభారతిలో విద్యుత్ శాఖ నుండి రూ 5,00,000 చెక్కును బాధిత కుటుంబానికి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు ముజుబుద్దీన్, ఎంపీపీ దశరథ్ రెడ్డి, మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు బొమ్మిడి రామ్ రెడ్డి, విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



నవతెలంగాణ-సదాశివనగర్

ఎల్లారెడ్డి నియోజకవర్గం సదాశివానగర్ మండలం ఉత్నూర్ గ్రామంలో ఆదివారం మదన్ మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజలలో అనూహ్య స్పందన లభిస్తోంది. కంటి సమస్యతో బాధపడుతున్న గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి పరీక్షలు చేయించుకున్నారు. కంటి వైద్య నిపుణుల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి కంటి మందులు అందజేశారు.

ఫ్యామిలీమెంబర్ సర్టిఫికెట్ దందా

- నాలుగువేలిస్తే.. రెండుమూడు రోజుల్లో చేతికి..
- డబ్బులివ్వకుంటే రెండుమూడు నెలల పాటు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలే
- అధికారుల సహకారంతో బ్రోకర్ల చేతివాటం..?

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ మండలంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కావాలంటే 3000 నుండి 5000 వరకు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు బయటకు వస్తున్నట్లు సమాచారం. భూమి పంపిణీ, మార్పిడి ఇతర ధరణి రిజిస్ట్రేషన్‌ల కోసం ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అవసరం ఉంటుంది. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కావాలంటే మీ సేవలో దరఖాస్తు చేసుకున్న తరువాత రెవెన్యూ అధికారులు పోలీస్ స్టేషన్, ఎంపీడీవో కార్యాలయం, గ్రామపంచాయతీ కార్యాలయాలలో సమాచారం తెలియజేసి 45 రోజుల తర్వాత ఎలాంటి అభ్యంతరాలు రాకపోతే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కు డిజిటల్ సైన్ చేయాల్సి ఉంటుంది. కానీ భిక్కనూర్ మండలంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కావాలంటే ఒక బ్రోకర్‌కు 3000 నుండి 5000 రూపాయలు చెల్లిస్తే రెండు రోజుల్లో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ చేతుల్లో పెడుతున్నట్లు సమాచారం. ఆ బ్రోకర్ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ రెండు రోజుల్లో ఎలా తీసుకొస్తున్నారో ఎవరికి తెలియడం లేదు. రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే అధికారులకు, సిబ్బందికి ముడుపులు అందజేసి తీసుకొస్తున్నాడా, డూప్లికేట్ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తయారుచేసి తీసుకొస్తున్నాడా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని ధరణి రిజిస్ట్రేషన్‌లకు అధికారులు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తప్పనిసరి చేయడంతో గత్యంతరం లేక బ్రోకర్‌లకు వేల రూపాయలు చెల్లించి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకుంటున్నారు. ఇంతా జరుగుతున్న రెవెన్యూ కార్యాలయ అధికారులు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ దందాను పసిగట్ట లేకపోవడం విడ్డూరంగా ఉంది. కార్యాలయం పేరు చెప్పి బయట వ్యక్తులు బ్రోకర్ దందా చేస్తున్న నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రెవెన్యూ కార్యాలయం పేరుతో బ్రోకర్ దందా చేస్తున్న వ్యక్తులను పట్టుకొని తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని బాధితులు, మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.



మీ సేవ

Family membership certificate -Application Form

Applicant Details

AADHAAR Card Number *: ____

Applicant Name * : ____ Relation Name* ____

Gender*: ☐ Male ☐ Female Date of Birth* (DD/MM/YYYY): ____

Permanent Address:

Door No : ____ Locality / Land Mark : ____

District*: ____ Mandal*: ____

Village / Ward *: ____ Pin Code : ____

Present Address:

Door No : ____ Locality / Land Mark : ____

గ్రామాల రూపురేఖలు

మార్చిన ఘనత కేసీఆర్‌ది

- మరోసారి ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తాం
- ఎమ్మెల్యే జాజాల సురేందర్




శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామీణ ప్రాంతాలు మౌలిక వసతులు కల్పించడంతో పాటు గ్రామాల రూపురేఖలు మార్చడం తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమయిందని ఎల్లారెడ్డి శాసనసభ్యులు జాజాల సురేందర్ అన్నారు. ఆదివారం లింగంపేట మండలంలో మోతే 85 లక్షలు ముస్తాపూర్ 45 లక్షలు శెట్టిపల్లి 89 లక్షలు అయ్యప్పలి తండా 20 లక్షలు అయ్యపల్లి కోటి 45 లక్షలు భవానిపేట్ తొంబై ఆరు లక్షలు జగదంబ తండా 30 లక్షలు బోనాలు కోటి ఐదు లక్షలు కోమటిపల్లి 95 లక్షలు పోతయ్య పల్లి రెండు కోట్ల 90 లక్షలు లింగంపేట్ సెంట్రల్ లైటింగ్ కోటి 30 లక్షలు మత్తడి పోచమ్మ ఆలయం వరకు రెండు కోట్ల రోడ్డు నిర్మాణం పనులు పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి మొత్తం మండలానికి 14 కోట్ల 65 లక్షల రూపాయలతో సిసి రోడ్ మురికి కాలువలో లైటింగ్ పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు తెలంగాణలో భాగంగా గ్రామాలను అభివృద్ధి చేసి గ్రామాల రూపురేఖలు మార్చారని అన్నారు. ప్రతి గ్రామానికి రోడ్లు మౌలిక వసతులు కల్పించి గ్రామాల రూపురేఖలు మార్చామన్నారు,. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాలకు రోడ్లు లేని పరిస్థితి ఉండేదని నేడు ప్రతి గ్రామానికి రోడ్లు మురికి కాలువలు సిసి రోడ్లు సెంట్రల్ లైటింగ్ లు ఏర్పాటు చేసి పల్లెల్లో వెలుగులు నింపామన్నారు. గ్రామాల్లో మిషన్ భగీర ద్వారా నీరు రైతులకు రైతుబంధు రైతు భీమా కల్యాణ లక్ష్మి షాది ముబారక్ బీసీ బంధు, దళిత బంధు గిరిజనులకు పోడు పట్టాలు బస్తీ దావకానలు కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన పాఠశాలలో సన్నబియ్యం కార్పొరేట్ స్థాయి విద్య బోధన చేపట్టినట్టు తెలిపారు. గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్ ది అన్నారు. లింగంపేట మండల ప్రజలకు రుణపడి ఉంటారని గత ఎన్నికల్లో మండలంలో పదివేల మెజార్టీని ఇచ్చి పట్టం కట్టారని అన్నారు. లింగంపేట గ్రామ సమీపంలోని ఆదిపరాశక్తి అయిన మత్తడి పోచమ్మ ఆలయం వద్ద గత ఎన్నికల్లో వ్రతం చేయించారని అమ్మవారి ఆశీర్వాదంతో నియోజకవర్గ మండల ప్రజల ఆశీర్వాదంతో మండల ప్రజలు భారీ మెజార్టీని ఇచ్చారని వారికి రుణపడి ఉంటాను. అదేవిధంగా పోచమ్మ ఆలయం వరకు భక్తుల సౌకర్యార్థం ఇబ్బంది కలగకుండా రెండు కోట్లతో బీటీ రోడ్ నిర్మాణం పనులకు నిధులు మంజూరు చేయించినట్టు తెలిపారు. అమ్మవారి ఆశీర్వాదం ఉండాలని మండల ప్రజలు మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని సేవకునిగా పనిచేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి, ఎంపీపీ గరీబునిస నయీం, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఒంటరి సిద్ధారెడ్డి లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ దేవేందర్ రెడ్డి, నల్లమడుగు సింగిల్ విండో చైర్మన్ రమేష్, బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బండి రాజయ్య, సర్పంచులు బొల్లు లావణ్య, ఏలేటి రామిరెడ్డి, పద్మా గంగారెడ్డి, మమత, వివేకానంద, లక్ష్మీనారాయణ సుగుణ ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిపథ్ ఆర్మీజవాన్‌కు సన్మానం



యువకుడిని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-మద్నూర్

కేంద్ర ప్రభుత్వం అగ్ని పథ్ ద్వారా ఆర్మీ జవాన్ ఉద్యోగాల భర్తీలో డోంగ్లి మండలంలోని మోగా గ్రామానికి చెందిన సతీష్ గౌడ్ అనే యువకుడు ఆర్మీలో ఉద్యోగం సంపాదించి ట్రైనింగ్ ముగించుకొని ఆ గ్రామానికి వచ్చిన సందర్భంగా మద్నూర్‌కు చెందిన ఆ యువకున్ని గురువు నవనీత్ మద్నూర్ మండల కేంద్రంలో ఆదివారం నాడు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం సంపాదించినందుకు శిష్యునికి గురువు అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో యువకుని తల్లి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా గ్రామ సర్పంచ్ సూర్యకాంత్ పటేల్, జెడ్పిటిసి కుటుంబ సభ్యులు కథలయ్య ఆయనకు ఘన స్వాగతం పలుకుతూ శాలువ పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

సెంట్రల్ లైటింగ్‌తో మద్నూర్‌కు కళ



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్ర మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో 9 కోట్ల నిధులతో సెంట్రల్ లైటింగ్ నిర్మాణం పనులు చేపట్టుకోవడం ఆనందంగా ఉందని, పనులు పూర్తయితే మద్నూర్ కళ ఉట్టిపడనుందని సర్పంచ్ ధరాస్ సురేశ్ అన్నారు. ఆదివారం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఏళ్ల తరబడి ఎదురుచూసే సెంట్రల్ లైటింగ్ నిర్మాణం పనులు తన హయాంలో ప్రారంభం కావడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. సెంట్రల్ లైటింగ్ నిర్మాణం కోసం తొమ్మిది కోట్ల

- పనులు ప్రారంభించుకోవడం ఆనందంగా ఉంది : సర్పంచ్

నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే హనుమంతు షిండేకు సర్పంచ్ గ్రామస్తుల తరఫున ఆయన తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సెంట్రల్ లైటింగ్ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ విట్టల్, నాయకులు రచ్చ కుశాల్, గల్పే శివాజీ, మద్నూర్ సింగిల్ విండో మాజీ చైర్మన్ పాకాల వార్ విజయ్ కుమార్, మండల సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు గఫర్, చిన్న తడ్గూర్ నాయకులు పాండురంగ పటేల్‌చ రజక సంఘం అధ్యక్షులు దేవదాస్, సొసైటీ డైరెక్టర్ తైదల రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ముందుండాలి

- కానిస్టేబుల్ గా ఎంపికైన వారికి సన్మానం

నవతెలంగాణ-బిచ్కుంద

ఇటీవల విడుదలైన కానిస్టేబుల్ నియామక ఫలితాలలో బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన సాయిని నవీన్ కుమార్, ఫత్లాపూర్ గ్రామానికి చెందిన ఇంగుశంకర్, చిన్నదేవాడ గ్రామానికి చెందిన కృష్ణ, వాజీద్ నగర్ గ్రామానికి చెందిన కుంటెల్లప్ప ప్రకాష్, కుంటెల్లప్ప శ్రీనివాస్, కుంటేళ్లప్ప విట్టల్ ఎంపికైయ్యారు. వీరిని మండల కేంద్రంలోని మున్నూరు కాపు కళ్యాణ మండపంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానిం చారు. పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్న మున్నూరు కాపులు చదువులో రాణించి ఉద్యోగాలు సాధించి వ్యాపార రంగాలతో పాటు రాజకీయాల్లో ఎదగాలని విద్యార్థులకు పై చదువుల కోసం ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న వారికి బిచ్కుంద మునూరు కాపు సంఘం ఎప్పుడు అండగా ఉంటుందని పెద్దలు సూచిం చారు. ఒకే కుటుంబానికి చెందిన సోదరులు శ్రీనివాస్, విట్టల్ లకు కానిస్టేబుల్ ఉద్యో గం రావడం పట్ల ప్రత్యేకంగా అభినందిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీహరిరాజు, మున్నూరుకాపు మండల అధ్యక్షులు గడ్డం అరవింద్, అధ్యక్షులు బొమ్మల లక్ష్మణ్, జుక్కల్ నియోజకవర్గం అధ్యక్షులు మొగులయ్య, ఆత్మకమిటి చైర్మన్ కొండా గంగాధర్, రైతు సహకార సంఘం అధ్యక్షులు శ్రీహరి బాలాజీ, సర్పంచ్ అరుణ్ కుమార్, రమణ స్వామి, హాజీ బాబ్రాజ్, హాజీ లక్ష్మణ్, పుల్లైన్ విట్టల్, లక్ష్మీనారాయణ, దర్పల్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



యువకులను సన్మానించిన పలువురు

సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న సర్పంచ్

నవతెలంగాణ-జుక్కల్

సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే ఆత్మీయ సమ్మేళనం నిర్వహించినట్టు సర్పంచ్ రమేశ్ రావ్ దేశాయి తెలిపారు. మండలంలోని క్రేమాజ్ కల్లాలిలో సర్పంచ్ పార్టీలకు అతీతంగా ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి వివిధ వివిధ గ్రామాల నుండి భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా క్రేమాజ్ కల్లాలీ సర్పంచ్ రమేష్ దేశాయి మాట్లాడుతు మండ లంలోని గ్రామాల వారిగా కార్యకర్తలు సమస్యలను వివరించారని. గ్రామాలలో జరిగిన అభివృద్ధి పనులను చర్చించి నారని, అదే విధంగా గ్రామాల వారిగా అభివృద్ధి నోచుకుని సమ స్యలు ఉన్న వాటిని పరిష్కార మార్గాలను ఒకరికొ కరు తెలుసుకుని పరిష్కరించుకుందామని అన్నారు. క్రేమాజ్ కల్లాలీ నాలుగు పర్యాయాలు ఉత్తమ పంచాయతీ ఆవార్డుతో పాటు ఒక సారి జాతీయ అవార్డు సైతం అందుకున్నట్టు తెలిపారు. అదే విధంగా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు పోడుభూములు సమస్య తీరలేదని, కొంతమందికి పట్టాలిచ్చారు చాల మందికి పోడురైతులకు మరిచిపోయారని, తమసమస్యలను తామే పరిష్క రించుకోవాలని , తమకున్న జిల్లా ఉన్నత అధికారుల పరిచయాలతో వారి కృషితో సహకారంతో గ్రామాభి వృద్ధి చేసుకుంటున్నట్టు తెలిపారు.

రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జుక్కల్‌లో కొత్త మండలం ఏర్పాటు చేయాలని, బిచ్కుందను డివిజన్ కేంద్రం చేయాలని అందరం కలిసి పోరాటం చేసి సాధించు కుందామని తెలిపారు. అదేవిధంగా వరికోనుగోలు కేంద్రాలలో కడ్తా పేరుతో దోపిడీ చేస్తున్నారని, రాబోయే రోజులలో సమస్యలను పరిష్కరిస్తేనే ఎవరు రైతులకు నమ్మకం కలిగించిన వారికి మద్దతు ఇద్దామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు, నాయకులు, యువకులు, రైతులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లుగా ముగ్గురు అన్నదమ్ములు

నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలో ఉద్యోగాలు భర్తీ చేయగా మద్నూర్ మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు కానిస్టేబుల్‌గా కొలువులు సాధించి శాఖాపూర్ గ్రామానికి వన్నె తెచ్చారని సర్పంచ్ ఎమ్‌కే పటేల్ తెలిపారు. ఆదివారమిక్కడ ముగ్గురు అన్నదమ్ముళ్లతో పాటు వాళ్ళ తల్లిదండ్రులకు తాత అమ్మలకు శాలువాలతో ఘనంగా సత్కరించారు. పోలీస్ శాఖలో కొలువులు సాధించిన ముగ్గురు అన్నదమ్ములు సతీష్, సచిన్, నితిన్, ఈ ముగ్గురు ఒకేసారి ఒకే శాఖలో కొలువురు తీరినందుకు గ్రామస్తులంతా అభినందించారు.



యువకులను వారి కుటుంబీకులను సన్మానిస్తున్న దృశ్యం

ఛలో హైదరాబాద్ జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సిద్దిరాములు

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంటిజెన్స్ వర్కర్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేటి చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని కాంటిజెన్స్ వర్కర్‌లు అధిక సంఖ్యలో తరలిరావాలని బిఎల్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్, సిద్దిరాములు పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సోమవారం ఛలో హైదరాబాద్ ఇందిరా పార్క్ దర్నా చౌక్ వద్ద దర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంటిజెన్స్ వర్కర్‌లు, అటెండర్‌లు, స్వీపర్లు, నైట్ వాచ్‌మెన్‌లు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంటీజేన్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులు సబ్బని లక్ష్మి నారాయణ, కాంటీజేన్స్ వర్కర్స్ యూనియన్, నాయకులు, భాస్కర్, రవి,రాజా మణి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభకు తరలిన ముదిరాజులు



లింగంపేట్ నుంచి తరలుతున్న ముదిరాజ్‌లు

నవతెలంగాణ-లింగంపేట్/సదాశివనగర్/గాంధారి

లింగంపేట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ముదిరాజ్ కులస్తులు ఆదివారం రాష్ట్ర రాజధాని లోని పెరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన ముదిరాజుల ఆత్మగౌరవ సభకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మండలంలోని పరమళ్ళ పోతాయపల్లి పోల్కంపేట్ శెట్టిపల్లి సంగారెడ్డి కోమటిపల్లి సూరాయపల్లి సజ్జనపల్లి కన్నాపూర్ నల్లమడుగు ఖానాపూర్ బోనాల్ మేంగారం లింగంపేట్ లింగంపల్లి శెట్టిపల్లి అయ్యపల్లి ఎక్కపల్లి రాంపల్లి తదితర గ్రామాల నుండి పలు వాహనాల్లో తరలివెళ్లారు.

సదాశివనగర్ : సదాశివ నగర్ మండలంలోని పలు గ్రామాల ముదిరాజులు హైదరాబాదులోని సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్లో జరిగిన పరేడ్ గ్రౌండ్‌కు తరలివెళ్లారు.

గాంధారి : ముదిరాజ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు హైదరాబాదులో నిర్వహిస్తున్న ఆత్మగౌరవ సభకు మండల కేంద్రం నుండి మండలంలోని సీతాయిపల్లి నేరల్ బ్రాహ్మణపల్లి మేడిపల్లి గుర్జాల్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి హైదరాబాదుకు ముదిరాజులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు

రేపు ఎమ్మెల్యే రాక

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలో 10 కోట్ల రూపాయలతో నిర్మించిన గాంధారి మెయిన్ రోడ్, సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభోత్సవానికి, మండలంలో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభోత్సవానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజల సురేందర్ మంగళవారం గాంధారి మండల కేంద్రానికి రానున్నట్టు గాంధారి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి శనిగ విత్తనాల పంపిణీ

నవతెలంగాణ-రాజంపేట్

రాజంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని గ్రామాలకు శనిగల విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పిఎసిఎస్ చైర్మన్ నల్లవెల్లి అశోక్ ఆదివారం పేర్కొన్నారు. 25 కిలోల శనిగల విత్తనాల ధర 1,875 రూపాయలుగా పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు

ప్రతిపక్షాలు దుష్ప్రచారాన్ని మానుకోవాలి

- భూములెవరివి లాక్కోము : విప్ గంపగోవర్ధన్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న విప్

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రతిపక్షాలు అధికార పార్టీపై చేసే దుష్ప్ర చారాన్ని మానుకోవాలని ప్రభుత్వ విప్పు, స్థానిక ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆదివారం అన్నారు. మండలంలోని జగదాంబ తండా, స్కూల్ తాండ, బట్టు తండాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాప, ప్రారంభోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కామారెడ్డిలో కెసిఆర్ పోటీ చేస్తున్నాడని, కెసిఆర్ వస్తే భూములు లాక్కుంటారని దుష్ప్రచారం చేస్తున్నారని, గజ్వేల్ లో ఎక్కడ కూడా భూములు లాక్కోలేరని, ప్రాజెక్టుల కింద రైతుల భూములు కోల్పోతే, కేంద్ర ప్రభుత్వం చెప్పిన ధరకు, రైతులకు నష్టపరిహారం అందించామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమ పథకాన్ని అందించిందని, పనిచేసే వారిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రంగు రవీందర్ గౌడ్, సర్పంచులు రాజు నాయక్, లలితా బుచ్చిరెడ్డి, రెడ్డి నాయక్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రామ్ రెడ్డి, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు రాజా గౌడ్, ఎంపీటీసీ సత్యాలి చంద్రు నాయక్,మండల బి ఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి సలావత్ బుచ్చిరెడ్డి, ఎంపీడీవో సవిత, పంచాయతీ కార్యదర్శులు అరవింద్ రెడ్డి, రాజేష్, ప్రజాప్రతినిధు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ల వితరణ ఎంతో గొప్ప సేవ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



యువకులకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు, హెల్మెట్లు అందిస్తూ రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేస్తున్న సేవ ఎంతో గొప్పదని బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తెడ్డు కిరీటి అన్నారు. మండలంలోని హాస కొత్తూర్ గ్రామంలో ఆదివారం మంత్రి ప్రశాంత్ రెడ్డి అందజేసిన హెల్మెట్లను యువకులకు పంపిణీ చేశారు. యువకులు ప్రయాణం చేసేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు తెడ్డు కిరీటి, రైతు సమన్వయ సమితి గ్రామ అధ్యక్షుడు నోముల నరేందర్, ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, మాజీ సర్పంచ్ బక్కురి గోపి, మాజీ ఎంపిటిసి తెడ్డు రాజన్న, యూత్ అధ్యక్షులు కట్ట చిరంజీవి, పెద్ది కిరణ్, ఏబీఎస్ భూఖ్య మోహన్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వసంత్ పాల్గొన్నారు.

ఎస్ఐ ఎల్. రామ్ బదిలీ

- ఎమ్మెల్యే మాట విననందుకే !
- మరో ఇద్దరు ఎస్ఐలపై వేటు పడనున్నట్టు సమాచారం

నవతెలంగాణ- మోపాల్

మోపాల్ మండల్ ఎస్సై ఎల్ రామ్‌పై బదిలీ వేటు పడింది. అంతర్గత సమాచారం ప్రకారం ఎమ్మెల్యే చెప్పిన మాట వినకుండా నిర్లక్ష్యం చేసినందుకు ఆయనను పోస్టింగ్ నుంచి తప్పించారని తెలిసింది. ఆయన స్థానంలో నిర్మల్ నుంచి గంగాధర్ మోపాల్ మండల ఎస్సైగా వస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఓ వ్యవహారంలో స్థానిక ప్రజా ప్రతినిధుల మాటను సైతం లెక్కచేయకుండా సదరు ఎస్సై వ్యవహరించారని, దీంతో ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేసి బదిలీ చేయించారని తెలుస్తుంది. నియోజకవర్గంలో మోపాల్‌తోపాటు మరో ఇద్దరి ఎస్ఐల పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహంగా ఉన్నారని ఎన్నికల కోడ్ రాకన్న ముందే వారిని కూడా బదిలీ చేసే ప్రక్రియ జరుగుతుందని నియోజకవర్గ ప్రజలు గుసగుసలాడుతున్నారు.

ఆశా కార్యకర్తల వంటవార్పు



భోజనాలు చేస్తున్న ఆశాకార్యకర్తలు

నవతెలంగాణ-కోటగిరి

ఆశా కార్యకర్తల నిరవధిక సమ్మె 14వ రోజుకు చేరటంతో ఆదివారం ఆశా కార్యకర్తలు మండల కేంద్రంలో వంటావార్పు చేసి, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలు అర్ధాకలితో అలమటిస్తుంటే కేసీఆర్ ప్రభుత్వం తమాషా చూస్తుందని మండిపడ్డారు. ఆశా కార్యకర్తల జీవితాలతో చెలగాటమాడితే కేసీఆర్ ప్రభుత్వానికి ఉసురు తగులుతుందని ఆశాలు శాపనార్ధాలు పెట్టారు. ప్రభుత్వం పట్టింపులకు పోకుండా తమ న్యాయమైన డిమాండ్లను చర్చల ద్వారా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు సుజాత, రమణి, రేష్మ, లతా, రుక్మిణి, స్వప్న, పంచశీల, కళావతి, నాగమణి, పోశవ్వ, కమల, సంగీత, శాంత, గంగామణి, శారద తదితరులు పాల్గొన్నారు

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ బిఎల్ఎఫ్ అభ్యర్థిగా సబ్బని లత

- ప్రకటించిన రాష్ట్ర కమిటి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ బిఎల్ఎఫ్ అభ్యర్థిగా సబ్బని లతను రాష్ట్ర కమిటి ప్రకటించిందని బీఎల్ఎఫ్ నాయకులు తెలిపారు. హైదరాబాద్ బాగలింగంపల్లిలో గల ఓంకార్ భవన్‌లో జరిగిన బహుజన లెఫ్ట్ ఫ్రంట్-బిఎల్ఎఫ్ రాష్ట్ర ఎన్నికల కమిటి సమావేశంలో మొదటి జాబితాను ఆదివారం ప్రకటించింది. రాష్ట్ర కమిటి 18 మందితో మొదటి జాబితా విడుదలచేసింది. ఇందులో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సబ్బని లతను నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్ పి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సబ్బని లతను రాష్ట్ర కమిటి ప్రకటించింది. గత రెండున్నర దశాబ్దాలుగా ప్రజాఉద్యమాల్లో క్రియాశీ పాత్ర పోషిస్తున్న సబ్బని లతను ఆ పార్టీ దగిన ప్రాదాన్యత ఇచ్చిందని బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్ పి జిల్లా కన్వీనర్ కె.మధు తెలిపారు.

గడపగడపకు కాంగ్రెస్



కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను వివరిస్తున్న సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-రెంజల్

మండలంలో ఆదివారం మాజీ మంత్రి పి సుదర్శన్ రెడ్డి గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని సాటాపూర్, కందకుర్తి, పేపర్ మిల్, నీల గ్రామాలలో గడపగడపకు తిరిగి కాంగ్రెస్ ఆరుగ్యారెంటీ పథకాలను ప్రజలందరికీ వర్తించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో భారీ ఎత్తున చేరికలు జరిగాయి. ముఖ్యంగా యువత కాంగ్రెస్ పార్టీ పట్ల ఆసక్తి చూపుతున్నారని మాజీ మంత్రి అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు ఉచిత బస్సు ప్రయాణం, ఒంటరి మహిళలకు 2500, రైతన్నలకు రెండు లక్షల రుణమాఫీ, 500 రూపాయలకు సిలిండర్, నిరుద్యోగులకు జీవనభృతి తదితర పథకాలను ప్రతి ఇంటికి తిరుగుతూ వివరించారు. ఆయన వెంట అంతిరెడ్డి రాజిరెడ్డి, తాహెర్బిన్ అందన్, గడుగు గంగాధర్, మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్, నాయకులు జావిద్ ఉద్దీన్, జి సాయి రెడ్డి, సిహెచ్ రాములు, గంగా కృష్ణ, గయాసోదిన్, నితిన్, ఎమ్మెల్ రాజు, సల్మాన్ ఖాన్, రవి, సిద్ధ సాయిలు, సద్దాం, గోసుల గంగా కిషన్, రాకేష్, సోక్కుల సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ వ్యాయామశాల భవన నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ కాలనీలో గల హనుమాన్ వ్యాయామశాల భవన నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేపట్టారు. హనుమాన్ వ్యాయామశాల శిథిలావస్థకు చేరడంతో సభ్యులు ప్రత్యేక చొరవతో బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. నూతన భవన నిర్మాణం కొరకు ఎమ్మెల్యే నిధులనుండి 5 లక్షల రూపాయలు మంజూరు చేశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడ్లూరు శ్రీనివాస్ ఎంపీ అరవింద్ దృష్టికి కూడా తీసుకువెళ్లడంతో ఆయన నిధుల నుండి 5 లక్షల రూపాయలు మంజూరు చేశారు. 10 లక్షల రూపాయల వ్యయంతో వ్యాయామశాల నూతన భవనం నిర్మించేందుకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాయామశాల సభ్యులు మాజీ కౌన్సిలర్ పెర్క స్వామి రేఖాం దాస్ మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే షకీల్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడ్లూరి శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, కారం స్వామి, కాపర్ల స్వామి, రేఖం కమలాకర్, శ్రీనివాస్, రాంబాబు, వెంకటేష్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న తోక లేని పిట్ట

- ప్రజా సేవలో తపాలా
- నేడు ప్రపంచ తపాలా దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్



పోస్ట్ ...పోస్ట్...అంటూ కాకి చొక్కా వేసుకొని సైకిల్‌పై ఇంటింటికి తిరిగే పోస్టు అనే గొంతు మాయమైంది. మారుతున్న కాలానుగుణంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక విప్లవంతో ఈ.. మెయిల్స్ ,,వాట్సాప్ అందుబాటులోకి రావడంతో క్రమేనా తోకలేని పిట్ట కనుమరుగవుతుంది. కాలం మారుతున్న కొందరు మాత్రం ఉత్తరాలు రాయడం మానుకోలేదు. కాలానికి అనుగుణంగా తపాలా శాఖ సైతం సంస్థను కాపాడుకునేందుకు వివిధ రూపాల్లో ప్రజలకు సేవలందిస్తుంది

నేడు సోమవారం ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా నవ తెలంగాణ కథనం.

పోస్టల్ డే ఏర్పడింది ఇలా..

గతంలో సమాచార మార్పిడికి క్షేమ సమాచారం తెలుసుకునేందుకు పోస్టు కార్డే ప్రధాన ఆధారంగా ఉండేది. కాల గమనంలో వచ్చిన మార్పులు దీనిపై పెను ప్రభావం చూపాయి. ప్రస్తుతం పోస్ట్ కార్డు మనుగడ కోసం పోరాడుతున్నది. సెల్ ఫోన్లు, కంప్యూటర్లు ,సోషల్ మీడియా ఇతర సాంకేతిక సాధనాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత దీని అవసరం తగ్గిపోతుంది .ఈ మెయిల్స్ చాలావరకు ప్రస్తుతం పోస్ట్ కార్డు పాత్రను పోషిస్తున్నాయి. కొన్ని ప్రదేశాల్లో మాత్రం ఇప్పటికీ పోస్ట్ కార్డునే వినియోగిస్తున్నారు. చరిత్రలోకి వెళ్తే మెసెంజర్ రూపంలో తపాలా సర్వీసులు ఉండేవి. వీళ్ల నడిచి లేదా గుర్రాల మీద వెళ్లి రాతప్రతిని చేర వేసేవారు. 1600, 1700 సంవత్సరాల్లో అనేక దేశాల వారు జాతీయ తపాలా వ్యవస్థను నెలకొల్పుకొని ఆయా దేశాల నడుమ తపాలా సౌకర్యాన్ని అందించేందుకు ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకున్నారు. 1878లో యూనివర్సల్ పోస్టల్ యూనియన్ గా మారింది. ఇది1948లో ఐక్యరాజ్యసమితికి ప్రత్యేక ఏజెన్సీగా రూపాంతరం చెందింది. 1969 అక్టోబర్ 1 నుంచి నవంబర్ 16 వరకు జపాన్ టోక్యోలో అనేక సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రతినిధులు అక్టోబర్ 9వ తేదీన వరల్డ్ పోస్టల్ డేను నిర్వహించాలని తీర్మానించారు.

దూరమవుతున్న మధురానుభూతులు...

ఉత్తరం అందుకోవడం ...రహస్యంగా విప్పి చదువుకోవడం ..ఎవరైనా వస్తుంటే దిండు కింద దాచుకోవడం.. దూరంగా సైన్యంలోనూ, మరో ఉద్యోగంలోను ఉన్న భర్త, కొడుకో ఉత్తరం రాస్తాడని, క్షేమ సమాచారం చెబుతాడని, వీధి వంక చూస్తూ గడిపే కాలం ఇంకా మధురమైనది.. ఆధునిక కాలంలో సాంకేతికత అందుబాటులోకి రావడంతో ఉత్తరాలు రాసుకునే తరం అంతరించి పోయింది.. పొడవాటి ఇనుప కమ్మీకి గుచ్చి ఉంచడం అవసరమైనప్పుడు మళ్లీ తీసి చదువుకోవడం రెండు మూడు దశాబ్దాల క్రితం ప్రతి ఇంట్లో ఉండేది. ఆ రోజుల్లో చాలా తక్కువ ఖర్చుతో సమాచారాన్ని దూరతీరాల్లోకి ఆత్మీయులకు చేరవేయడానికి తపాలా రంగం అందించిన సేవలు వెలకట్టలేనివి ..అలాంటి పోస్టల్ శాఖకు సంబంధించి నేడు జాతీయ తపాలా దినోత్సవాలు నిర్వహిస్తున్నారు.

పోస్టల్ సేవలు...

ఉత్తరాల పంపిణీ, స్పీడ్ పోస్ట్, ఈ పోస్టు సర్వీస్, ఆధార్ నమోదు, ఆలయాల ప్రసాదాల సర్వీసు, కనిష్ఠ, గరిష్ఠ, పెట్టుబడి పథకం, టైం డిపాజిట్, సుకన్య సమృద్ధి ఖాతా, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, నెలవారి ఆదాయం వంటి పథకాలు అమలు చేస్తున్నది. పలువురు దేశ, విదేశాలకు చెందిన ఐదువేల స్టాంపులను సేకరించి తపాలా స్టాంపుల ప్రదర్శనల్లో పాల్గొంటున్నారు. రెండు, మూడు ఐదు పైసల స్టాంపులు, మన దేశంలోని స్వతంత్ర సమరయోధులు, రాజకీయ నాయకులు, శాస్త్రవేత్తలు, మేధావులు, సినీ నటులు, క్రీడాకారులు, కళాకారులు, చారిత్రక కట్టడాలు, పక్షులు, జంతువుల, తపాలా బిల్లలు, మినీ ఓచర్స్, ఫస్ట్ డే కవర్లు, బ్రోచర్లను సేకరించి కొందరు ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నారు.

మరిన్ని సేవలు అందిస్తున్నాం



విదేశాలకు వస్తువులను ఎగుమతి చేసే సంస్థలకు,,, తక్కువ ఖర్చుతో సులభంగా డాక్ నిర్యాత్ కేంద్రాల ద్వారా కామారెడ్డి ,నిజామాబాద్ పట్టణాలలో విదేశాలకు వస్తువులను పంపేందుకు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోస్టల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

యాపా రు సురేఖ,
పోస్టల్ సహాయ పర్యవేక్షకురాలు-నిజామాబాద్

గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలి



ఆడపిల్లలకు, మహిళలకు ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన పోస్టల్ పథకాలను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

సంతని గణేష్-స్థానికులు ఆర్మూర్

ముదిరాజ్ ఆత్మగౌరవ సభకు తరలిన ముదిరాజ్‌లు

నవతెలంగాణ-డిచ్‌పల్లి/బోధన్

హైదరాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్లో ఆదివారం ముదిరాజుల ఆత్మగౌరవ సభకు నిజామాబాదు రూరల్ నియోజకవర్గ ముదిరాజ్ నాయకులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇమ్మడి గోపి ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద ఎత్తున ఇందల్ వాయి టోల్ ప్లాజా నుండి ప్రైవేట్ బస్సులు, కార్లు ఇతర వాహనాల్లో భారీగా బయలుదేరారు.ఈ సందర్భంగా ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ధర్పల్లి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి మాట్లాడుతూ ముదిరాజుల రాష్ట్ర వ్యాప్తంగా జనాభాలో సగ భాగంలో ఉన్న కొన్ని పార్టీలు ముదిరాజులను గుర్తించకపోవడంతో ముదిరాజుల సమస్యలు విన్నవించుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభ ద్వారా టిక్కెట్ ఇవ్వని పార్టీలకు కనువిప్పు కలిగేలా చేస్తామని తెలిపారు. తరలిన వారిలో జిల్లా, రూరల్, మండలాల , ముదిరాజులు తదితరులు ఉన్నారు.



డిచ్‌పల్లి : ముదిరాజ్ ఆత్మగౌరవ సభకు తరలుతున్న నాయకులు



బోధన్ : సభకు వెళ్తున్న సాలూర మండల నాయకులు

బోధన్:హైదరాబాద్ నగరంలో నిర్వహిస్తున్న ముదిరాజ్‌ల ఆత్మ గౌరవ మహాసభకు సాలూర మండలానికి చెందిన ముదిరాజ్ సంఘ నాయకులు వాహనాలలో తరలివెళ్లారు. ముదెరాజ్‌ల ఆత్మగౌరవ సభకు తరలిన వారిలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రత్నెల్లి లింగయ్య, సంగెపు భీంరావ్, దార్నే గంగాధర్, పీరాజి, వంకాయ లక్ష్మణ్, ముకుంద్ రావు, పాపాయి హన్మండ్లు, రమేష్ తదితరులు ఉన్నారు.

పోలీస్ ఉద్యోగాల్లో చేరిన వారికి సన్మానం



పోలీస్ ఉద్యోగాల్లో చేరిన వారిని సన్మానించిన వికార్‌భాష

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామంలో ముగ్గురు యువకులకు పోలీస్ కొలువుల చేరడంతో వారికి స్థానిక సర్పంచ్, సర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు వికార్ భాష ఘనంగా సన్మానం చేశారు. వీరితోపాటు వీరన్న గుట్ట సర్పంచ్ బైండ్ల రాజు కూడా పోలీసు ఉద్యోగం సంపాదించడంతో ఆయనకు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో కష్టాలను ఎదుర్కొని, పట్టుదలతో ఉద్యోగం సాధించిన యువత మిగతా యువతకు స్ఫూర్తి కావాలని ఆయన అన్నారు. యువత చెడు మార్గాలను వదిలి, తల్లిదండ్రుల గౌరవాన్ని తీసుకురావడానికి అన్నారు. తన వంతుగా సాంటాపూర్ గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సాటాపూర్ ఎంపీటీసీ ఎస్.కె అహ్మద్, సర్పంచులు మీర్జా కలీం బేగ్, కందకుర్తి ఎంపీటీసీ అసాద్ బేగ్, రంజాన్ సింగిల్ విండో చైర్మన్ మొహీసుద్దీన్, డీల సింగిల్ విండో చైర్మన్ ఇమామ్ బేగ్, నాయకులు రాఘవేందర్, మాజీ ఎంపీటీసీ నరసయ్య, కృష్ణారావు, బాబు నాయక్, హాజీ ఖాన్, విజయ్, బోర్గం ఉప సర్పంచ్ ఫిరోజ్ ఉద్దీన్, యువకులు పాల్గొన్నారు.

ఎత్తొండలో గొర్ల పంపిణీ



గొర్లు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి

నవతెలంగాణ-కోటగిరి

తెలంగాణా ప్రభుత్వం గొల్ల కుర్మలకు చేయూత నందించేందుకు చేపట్టిన ఎస్ఆర్‌డీపీ పథకంలో భాగంగా మండల పశువైద్యాధికారి డాక్టర్.సురేష్ కుమార్ ఆధర్వంలో మండలంలోని ఎత్తొండ గ్రామానికి చెందిన లబ్దిదారులకు 12 యూనిట్ల గొర్లను ఆదివారం పంపిణీ చేశారు. ఎత్తొండ గ్రామానికి మొదటి విడత గొర్ల పంపిణీలో భాగంగా 29 యూనిట్లు ఇచ్చామని తెలిపారు. ప్రస్తుతం రెండవ విడత గొర్ల పంపిణీ ప్రారంభమైందని 12 యూనిట్లు పంపిణీ చేశామని చెప్పారు. మరో వారంలోగా మిగిలిన 10మంది డీడీ కట్టిన లబ్దిదారులకు గొర్లు పంపిణీ చేస్తామని వైద్యాధికారి సురేష్ తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న ఈ గొర్ల పంపిణీ పథకాన్ని గొల్ల కుర్మలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిబాబా, ఎంపీటీసీ ఫారుఖ్, లీడర్లు అగ్గు హన్మంతు, దేవేందర్, ఆనంద్, భూమయ్య తదితరులున్నారు.

పలుగ్రామాల్లో ఘనంగా ఊర పండగ

నవతెలంగాణ-రెంజల్/డిచ్‌పల్లి/బోధన్

మండలంలోని కూనేపల్లి గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఊర పండుగ ఆదివారం నిర్వహించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని వారు కోరుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రొడ్డ విజయ లింగం, గ్రామ కమిటీ అధ్యక్షులు నీరడి సాయిలు, ఉప సర్పంచ్ మల్లేష్, దేవదాస్, రామ్ రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి: ఊరపండుగలో పాల్గొన్న గ్రామస్తులు

డిచ్‌పల్లి:డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండల కేంద్రంలతో పాటు ఘనపూర్, తిర్మన్ పల్లి గ్రామలలో ఆదివారం ఘనంగా ఊర పండుగ నిర్వహించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండి అందరు ఆర్థికంగా బాగుపడి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయా గ్రామాల గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు శక్కరి కొండ కృష్ణ, కుర్రి రామకృష్ణ, గోపు గోవర్దన్ పాల్గొన్నారు.



బోధన్ మండలంలో..

బోధన్:బోధన్ మండలం లంగ్డాపూర్ గ్రామంలో ఆదివారం గ్రామస్థులు బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో గ్రామ దేవతల వద్దకు చేరుకుని సమర్పించారు. అనంతరం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో సర్పంచ్ పవన్, ఉప సర్పంచ్ సత్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై పోస్టల్ ద్వారా నిరసన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

దేశంలో, రాష్ట్రంలో రిజర్వేషన్ల అమలు విధానంపై తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీలో పోస్టల్ ద్వారా నిరసన కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను ప్రస్తుతమున్న 27శాతం నుండి 60 శాతం వరకు పెంచాలని అప్పుడే వారి ప్రతిభకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ల విధానం వల్ల బిసి లకు తీవ్ర నష్టం జరుగుతుందని, ఇటీవలే వచ్చిన కానిస్టేబుల్ ఫలితాలు, సివిల్స్ ఎగ్జామినేషన్ ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. రాజ్యాంగ ప్రతిఫలాలు అందే విధంగా బీసీల రిజర్వేషన్లు జనాభా ప్రతిపాదికను పెంచితే సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఉందన్నారు. ప్రస్తుత రిజర్వేషన్ కొనసాగితే ఇంకా వెనకకు నెట్టివేయబడుతూ రాజకీయ, సామాజిక, ఆర్థిక వివక్షపు గురవుతుంటారని వివరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, శివ, సూర్య సాయి, పవన్, కృష్ణ, శ్రీకాంత్, రామ్ చందర్ , శివ కుమార్, నరేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వాకిలే కూరగాయల తోట

- 10 రకాల కూరగాయల పెంపకం
- పండు, పూలమొక్కలు సైతం

నవతెలంగాణ-బోధన్

నేటి ఉరుకుల పరుగుల కాలంలో ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవడంలో చాలామంది నిర్లక్ష్యం వహిస్తూ ఉంటారు. అలాగే ఉన్న ఖాళీ స్థలాన్ని కూడా సక్రమంగా వినియోగించరు. కానీ కొంతమంది ప్రణాళిక ప్రకారంగా పరిసరాలు పరిశుభ్రతతో పాటు ఇంటి సమీపంలోని ఖాళీ స్థలాన్ని ఎలా వినియోగించుకోవాలో తెలుసుకుని దానిని పూర్తిగా ఆచరణలో పెట్టి ఇతరులకు ఆదర్శంగా ఉంటారు.

నేటి కాలంలో మార్కెట్లో లభించే ప్రతి వస్తువు, తినుబండారాలు రసాయనాలతో కలుషితమయి ఉంటున్నాయి. అయినా కూడా తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని తిని అనారోగ్యం బారిన పడుతున్నాం. అలాగే మార్కెట్లో రోజు ఎన్నో రకాల కూరగాయలు విక్రయానికి వస్తాయి. కానీ కొంతమంది తాము స్వయంగా పండించిన కూరగాయలను తినడానికి ఇష్టపడతారు. సాలూర మండల కేంద్రానికి చెందిన సాలెన్ సంజీవ్ ఎప్పుడు స్వచ్ఛమైన తాజా ఆహార పదార్థాలను కోరుకుంటారు. ఆ దిశగా ప్రయత్నిస్తున్నారు. అలా ఆయన అభిరుచిలో మేరకు తన ఇంటి ఆవరణలో ఉన్న కొద్దిపాటి ఖాళీ స్థలంలో కూరగాయల పెంపకానికి శ్రీకారం చుట్టారు. అందులో 10 రకాల కూరగాయల మొక్కలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలు పెంచుతున్నారు.



కూరగాయల తోటలో సాలెన్ సంజీవ్

కూరగాయలు మొక్కల పెంపకం అంటే ఇష్టం..
సాలెన్ సంజీవ్, సాలూర.

తనకు చదువుకునే రోజుల నుండే కూరగాయలు, మొక్కలు పెంపకం అంటే ఇష్టం. అందుకే ఇష్టమైన పది రకాల కూరగాయల మొక్కలు, పండ్ల మొక్కలు, పూల మొక్కలు పెంచుతున్నాను. ఇంటి ఆవరణలో ఖాళీ స్థలం ఉండడంతో దానిని ఇలా మొక్కల పెంపకంతో ఆహ్లాదంగా మార్చాను. తాను మెడికల్ డిపార్ట్మెంట్లో పనిచేయడం వలన కలుషితమైన ఆహార పదార్థాల వినియోగం వలన జరిగే నష్టాల నుండి జాగ్రత్త వహించాలని స్వయంగా ఈ కూరగాయ మొక్కలు పెంచుతున్నాను. దాంతో నా కుటుంబానికి కావలసిన తాజా కూరగాయలు లభిస్తున్నాయి.

ఆకుకూరలు, పండ్ల మొక్కల పెంపకం..

సంజీవ్ తన ఇంటి ఆవరణలో పాలకూర, కొత్తిమీర, క్యారెట్, ముల్లంగి, బెండకాయ, టమాట, వంకాయ, గోంగూర, బీరకాయ, ములక్కాయ, గోరుచిక్కుడు, తీగ చిక్కుడు, దొండకాయ , కాకరకాయ, క్యాలీఫ్లవర్, బిర్యానీ ఆకు మొక్క, సొరకాయ, గుమ్మడికాయ, దిష్టి గుమ్మడికాయ, తోటకూర, మెంతెం కూర లాంటి ఆకుకూరలు, తీగ మొక్కల కూరగాయలు పండిస్తున్నారు. వాటితో పాటు పండ్ల మొక్కలైన సపోటా, నిమ్మకాయ, బొప్పాయి, కరివేపాకు చెట్టు, జామ లాంటి పండ్ల మొక్కలు పెంచుతున్నారు. అలాగే గులాబీ, మల్లె , చామంతి లాంటి పూల మొక్కలు సైతం పెంచుతున్నారు. దాంతో ఇంటి ఆవరణలో స్వచ్ఛమైన వాతావరణంతో పాటు కుటుంబానికి కావలసిన తాజా కూరగాయలు లభిస్తున్నాయని సంజీవ్ పేర్కొన్నారు.